




ఓ సర్వేయర్‌కు ఇలా రూ.10 వేలు..

"కొందరు గ్రామ సచివాలయ సర్వేయర్లు అక్రమ సంపాదనకు అర్రులు చాస్తున్నారనే ఆరోపణలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. పైసలు ఇవ్వనిదే సర్వే గొలుసు కూడా పట్టరనే విమర్శలు ఉన్నాయి. భూమి విస్తీర్ణాన్ని బట్టి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులిస్తే రికార్డులను సైతం తారుమారు చేస్తారనే అపవాదును కొందరు మూటగట్టుకుంటున్నారు."

- ఆంధ్రజ్యోతి, బత్తలపల్లి

లెక్కల కొలతలు..!

భూ సర్వే కావాలంటే డబ్బులివ్వాల్సిందే

- పైసలు ఇవ్వని రైతులకు తప్పని తిప్పలు
- జాయింట్ ఎల్‌పీఎంలతో ఇబ్బందులు
- మామూళ్లు ముడితే చాలు రికార్డులు తారుమారు
- హెచ్చుమీరిన సచివాలయ విలేజ్ సర్వేయర్ల అవినీతి

జేబులు నింపితేనే కొలతలు..

మండలంలో అన్నదమ్ముల మధ్య వివాదం ఉన్న భూముల సర్వేకు చలాన కట్టి, రసీదును సచివాలయంలో అందజేస్తే చాలు విలేజ్ సర్వేయర్ల మొహాలు వెలిగిపోతాయి. చలానా కట్టిన వ్యక్తి ఎప్పుడెప్పుడు వస్తాడా, అయినాకాడికి గుంజుదామా అని ఎదురు చూస్తుంటారు. మండలంలోని ఓబుళాపురం, దంపెట్ల, అప్రాచెరువు, పోట్లమర్రి తదితర పంచాయతీల్లో సర్వేయర్ల అక్రమాలు తారస్థాయికి చేరినట్లు ఆయా సచివాలయాల్లో మిగతా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందే పేర్కొంటున్నారు. అన్నదమ్ముల భూ వివాదంలో కాసులకు కక్కుర్తి పడి భూమి కొలతలు తారుమారు చేయడంతో దంపెట్ల గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎవరైనా చలానా కట్టాం కదా మా భూమి సర్వే చేయమని అడిగితే వారికి చుక్కలు చూపుతున్నట్లు సమాచారం. చలానా కట్టారు సరే మరి మా విషయం ఏమిటి అని నేరుగా ప్రశ్నిస్తున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగినంత ఇవ్వకపోతే..

అడిగినంత ఇవ్వకపోతే నెలల తరబడి తిప్పుకుంటున్నట్లు వాపోతున్నా రు. ఓబుళాపురం పంచాయతీలో రీసర్వే జరుగుతున్న సమయంలో డబ్బులు ఇవ్వలేదని సర్వే నెంబర్ 184లో గట్లు ఉన్న లేనట్లు నలుగురికి జాయింట్ ఎల్‌పీఎం పెట్టారు. ఇలా పెడితే తమకు ఇబ్బంది అని అడిగిన రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకుని, సింగిల్ ఎల్‌పీఎం కోసం రూ.50 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.30వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో ఆ రైతు రూ. 15వేలు ఫోన్‌పే ద్వారా, రూ.15వేలు నగదు అందజేశారు. సర్వే నెంబర్ 185లో బ్రిటిష్ కాలం నుంచి ఉన్న రెండు ప్లాన్ రస్తాలను తొలగించి, పక్కన ఉన్న మరో రైతుతో డబ్బు తీసుకొని వారికి ఉపయోగపడేలా 184లో మూడు రస్తాలను ఏర్పాటు చేశారు. రామాపురం గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 357లో 18 ఉండగా అందులో 10మంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎం పెట్టారు. ఎందుకు ఇలా పెట్టారు అని అడిగితే డబ్బులు ఇస్తే తొలగిస్తామని చెప్పారు. దీంతో ఆ రైతు ఏడు వేలు ఇచ్చాడు. తక్కువ డబ్బులు ఇచ్చాడని ఆరైతు సమస్య పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టారు. సర్వే నెంబర్ 98-4లో రస్తా ఉంది. పక్కన ఉన్న రైతుతో డబ్బు తీసుకొని రస్తాను ఆయన భూమిలో కలిపేశారు. కోడెకండ్ల గ్రామానికి చెందిన ఓ రైతు భూమిని ఆరుగురు రైతులకు జాయింట్ ఎల్‌పీఎం చేశారు. పరిష్కారానికి ఆ రైతుతో రూ.30 వేలు తీసుకుని కూడా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు.

రీసర్వే పేరిట బెదిరింపులు

మండలంలోని దంపెట్ల పంచాయతీలో కట్టకిందపల్లికి చెందిన ఓ ఓ రైతు కుటుంబం 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి సైతం రీసర్వేలో నీకు భూమి లేదని తెలిపారు. ఆరైతు నుంచి రూ. 80 వేలు తీసుకొని నీకు 4.53 ఎకరాల భూమి ఉందని, భయపడవద్దని హామీ ఇచ్చారు. గ్రామాలలో అమాయకులను ఎంపిక చేసి వీఆర్‌ఏ ద్వారా 'మీకు భూమి లేదు. రీసర్వేలో పోయింది' అని బెదిరిస్తున్నారు. భయపడిన వారిని సచివాలయానికి పిలిపించుకుని సెటిల్మెంట్ చేసుకుంటున్నారు. వారికి డబ్బులు ఇవ్వనివారి భూములను జాయింట్ ఎల్‌పీఎంలో వేస్తారు.ఆ సర్వే నెంబర్‌లో ఉన్నభూములు అన్నీ ఒకే ఎల్‌పీఎంలో ఉంటాయి. దీంతో వారికి 1బీలు రావు. ప్రభుత్వ పథకాలు అందవు. పంట రుణాలు రెన్యువల్ చేసుకోలేరు. ఇన్ని ఇబ్బందులు ఉండటంతో బేరం కుదుర్చుకుని రైతులు వారికి కొంత సొమ్ము ముట్టచెబుతున్నారు.

జేసీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

నా భూమిని జాయింట్ ఎల్‌పీఎం నుంచి తొలగించడానికి రూ.30 వేలు లంచం ఇచ్చా. అయినా పని జరగకపోవడంతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశా. అయినా చర్యలు శూన్యం. మాగోడు ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

- ఆంధ్రా మోహన్, కోడేకండ్ల

ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపా

మండలంలోని సచివాలయాల్లో పని చేసే విలేజ్ సర్వేర్‌లు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నట్లు నాదృష్టికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులైన ఆర్డీఓ, జేసీలకు రిపోర్టు పంపించా. ఎవరైనా రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే, విచారించి అక్రమాలకు పాల్పడినట్లు తెలితే ఉన్నతాధికారులకు నివేదిస్తా.

- జోసఫ్, మండల సర్వేర్

అర్జీలపై అలసత్వం వద్దు: జేసీ

పుట్టపర్తి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజలు ఇచ్చే అర్జీల పట్ల అలసత్వం చూపరాదని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 281 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జేసీ మాట్లాడు తూ ఫిర్యాదుదారుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మెరుగైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీదారుడు సంతృప్తి పడేలా నిర్ణీత గడువులోపు వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై అర్జీలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధి కారి సుబ్బారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

సత్వరం పరిష్కరించండి: ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల్లో చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రత్న అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 61 ఫిర్యాదులను స్వీకరించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థిక మోసాలు, ఆస్తి పంపకాల కు సంబంధించిన వివాదాలు, సైబర్‌నేరాలపై ఎక్కువగా ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కోర్టు కాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన

పుట్టపర్తి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు కాంప్లెక్స్ సామూహిక భవన నిర్మాణాల కోసం అవసరమైన స్థలాన్ని సత్వరమే కేటాయించాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి సయ్యద్ ముజీబ్ పసపల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తి బార్ అసోసియేషన్ న్యాయవాదులు, తహసీల్దార్ కళ్యాణ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన కప్పలబండ పంచాయతీలోని ఎన్టీచౌదరి లేఔట్ సమీపం, కప్పలబండ పారిశ్రామికవాడ సమీపంలో రెవెన్యూ భూములను పరిశీలించారు. అన్ని వసతులు ఉన్న పది నుంచి 12 ఎకరాలను భూములను కోర్టుకాంప్లెక్స్ సామూహిక భవనాలకు కేటాయించాలని తహసీల్దార్ కళ్యాణ్‌కు సూచించారు. వివాదాలకు తావులేని రీతిలో భూమిని గుర్తించి కేటాయించాలన్నారు. పారిశ్రామికవాడకు సమీపంలోని దేవదాయశాఖకు చెందిన భూమి అనువుగా ఉంటుందని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, లెక్కల యదుభూషణ్, చల్లాశేఖర్, భారతిరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి

ముళ్ల కంపలు వేసిన వారిపై చర్యలు తీసుకోండి

- డీఎస్పీకి దళితుల ఫిర్యాదు.. 11 మందిపై కేసు


ఫిర్యాదు చేస్తున్న సుబ్బరావుపేట ఎస్సీ కాలనీవాసులు, సంఘాల నాయకులు

ధర్మవరం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): దళితులు తమ కాలనీ నుంచి గ్రామంలోకి రాకుండా ముళ్ల కంపలు అడ్డుగా వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంఘాల నాయకులు డీఎస్పీ హేమంత్ కుమార్‌ను కోరారు. మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో మొహర్రం సందర్భంగా తప్పెట కొట్టేందుకు రాలేదనే ఉక్రోషంతో వైసీపీ వర్గీయులతో పాటు మరికొంత మంది ఎస్సీకాలనీకి వెళ్లే రహదారికి ముళ్లకంపలు అడ్డంగా వేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ గ్రామ ఎస్సీలు చిన్నగంగన్న, పెద్దిరాజు తదితరులు సోమవారం ఎస్సీ సంఘాల నాయకులతో కలిసి డీఎస్పీ హేమంత్‌కుమార్, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సీలపై వివక్ష చూపించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నగంగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన 11మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. రంగనాయకులు, బాలు, కె.విశ్వనాథ్, రమణ, అజయ్, నరేంద్ర, శశిధర్, నంద, విజయ్, రాజు, ఓబిలేసుపై కేసు నమోదు చేశామన్నారు.

మడకశిర పీఠం టీడీపీదే..!

- 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్

మడకశిర టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ టీడీపీ పరం కానుంది. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మే 15న చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డి పదువులను కోల్పోయారు. ఖాళీ అయిన పదవుల కోసం ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 16న కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక జరగనుంది. ఎన్నికల నిర్వహణకు నగర పంచాయతీ కార్యాలయాన్ని సిద్ధం చేశారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ను ఎన్నికల అధికారిగా కలెక్టర్ నియమించారని నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. మడకశిర నగర పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. టీడీపీ కౌన్సిలర్లు ఐదుగురు, వైసీపీ కౌన్సిలర్లు ఎనిమిది మంది గతంలో జరిగిన అవిశ్వాసానికి మద్దుతు ఇచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 5వ వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వ వార్డు కౌన్సిలర్ సుధాకర్ నాయక్, 6వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ దాసప్ప, 13వ వార్డు సుజాతమ్మ రమేష్, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వ వార్డు సుభద్ర నాగేంద్ర, 18వ వార్డు సావిత్రమ్మ బలరామ్ తదితరుల మద్దతులో అవిశ్వాసం నెగ్గింది. వైసీపీలోనే ఉన్న 20వ వార్డు కౌన్సిలర్ సిద్దప్ప కూడా అవిశ్వాసానికి మద్దతు ఇచ్చారు. ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిసి 15 మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు. దాదాపు ఇదే బలంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు వెళుతున్నారు. నగర పంచాయతీని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. టీడీపీ తరఫున గెలిచినవారిలో 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజుకు చైర్మన్ అయ్యే అవకాశం ఉంది. ఈయన కాకుండా, టీడీపీలో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్లు పోటీలో ఉన్నారు. దీంతో పీఠం ఎవరిని వరిస్తుందోనన్న చర్చ మొదలైంది.



మడకశిర నగర పంచాయతీ కార్యాలయం

16 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

పుట్టపర్తి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీ ప్రభుత్వం నియమించింది. చిలమత్తూరు పీఏసీఎస్ అధ్యక్షురాలిగా చెన్నమ్మ, సోమందేపల్లి పీఏసీఎస్ అధ్యక్షులుగా పి.వెంకటేశులు, దామాసిపల్లికి నరసింహులు, సోమఘట్టకు బయపరెడ్డి, బూదిలికి శివశంకర రెడ్డి, గోరంట్లకు గోపాలరెడ్డి, వానవోలుకు గుత్తా వెంకటరమణప్ప, మహమ్మదాబాద్‌కు నరేష్, గొల్ల చెరువుకు శ్రీనివాసరెడ్డి, పీకేవి పల్లికి రాజారెడ్డి, పి.సదంకు వెంకటరమణప్ప, అమరాపురం పీఏసీఎస్‌కి ఎన్.గణేష్, మందలపల్లికి కుంటెప్ప, మడకశిరకు అనంత నరేష్ రాజ, క్రిష్ణాపురం పీఏసీఎస్‌కి కె.పోతిరెడ్డి, కనగానపల్లికి వెంకటేశ్వర్లును నియమించారు.

రేపు పురానికి రెవెన్యూమంత్రి

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ బాలాజీ తెలిపారు. మంత్రి మంగళవారం బెంగళూరుకు చేరుకోనున్నారు. బుధవారం ఉదయం 10గంటలకు చిలమత్తూరు మండలం కోడూరులో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి లేపాక్షి మండలంలో జరిగే తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి హిందూపురం చేరుకుని ముఖ్యనాయకులతో సమావేశమై అనంతరం బెంగళూరుకు రోడ్డుమార్గాన వెళ్లనున్నట్లు తెలిపారు.

నెరవేరుతున్న లోకేశ్ హామీ

గార్లదిన్నెలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు

ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ అధికారుల స్థల పరిశీలన

స్వాగతిస్తున్న చీనీ రైతులు



గార్లదిన్నె మండలం మర్తాడులో 800 కిలో మీటర్ల మైలురాయి శిలాఫలాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

అనంతపురం అర్బన్ /గార్లదిన్నె, జూలై 14(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో యువనేత నారాలోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరనుంది. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో యువగళం 800 కిలో మీటర్ల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు మర్తాడు గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ క్రమంలోనే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల మండలంలోని కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో రెండు చోట్ల చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం పొలాలను ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ అధికారులు పరిశీలించారు.

రూ.3.5 కోట్లతో యూనిట్

చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటును జిల్లా రైతులు స్వాగతిస్తున్నారు. రూ.రూ.3.5 కోట్ల వ్యయంతో 3 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ప్రైమరీ చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చీనీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్‌పీఓకు నిర్వహణ బాధ్యతలు

జిల్లా వ్యాప్తంగా 40వేల హెక్టార్లల్లో చీనీ పంట సాగవుతోంది. జిల్లాలో పండించిన చీనీకి మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు రైతుల పొలాల్లోనే చీనీ పంటను కొనుగోలు చేసి, ఢిల్లీ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు రైతులు బయట వ్యాపారులకు చీనీ పంటను విక్రయిస్తుండగా.. మరికొందరు రైతులు అనంతపురం మార్కెట్ యార్డులో అమ్ముకుంటున్నారు. చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసిన తర్వాత ఎఫ్‌పీఓకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. చీనీ పంటను ప్రాసెసింగ్ చేసేందుకు రైతులతో నామమాత్రంగా డబ్బు వసూలు చేసేలా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

హామీ నిలబెట్టుకుంటున్న నారా లోకేశ్



యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ చీనీ రైతులకు ఇచ్చిన హామీని నెలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు మండలంలోని రెండు గ్రామాల్లో స్థలాలను పరిశీలించడం సంతోషకరం. త్వరగా స్థలాన్ని ఖరారు చేసి, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- రైతు రామసుబ్బయ్య, మర్తాడు, గార్లదిన్నె మండలం

చీనీ రైతులకు చాలా ఉపయోగం



చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు చాలా ఉపయోగపడుతుంది. చీనీ కాయలను గ్రేడ్ల వారిగా ప్రాసెసింగ్ చేస్తే నాణ్యమైన కాయలకు ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రాసెసింగ్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో అన్ని కాయలను కలిపి తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు అవకాశం ఉంటుంది.

- రైతు నరసింహారెడ్డి, ముకుందాపురం, గార్లదిన్నె మండలం

దూరం.. దూరం..!

విస్తృతస్థాయి సమావేశానికి పెద్దారెడ్డి వర్గం డుమ్మా



మాట్లాడుతున్న సమన్వయకర్త శైలజానాథ్

యల్లనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశానికి పెద్దారెడ్డి వర్గం డుమ్మా కొట్టింది. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శింగనమల వైసీపీ సమన్వయకర్త శైలజానాథ్ హాజరయ్యారు. సమావేశం భోగాతి ప్రతాప్‌రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేయడంతోనే పెద్దారెడ్డి వర్గీయులు దూరంగా ఉండాలని భావించినట్లు తెలిసింది. మండలంలో వైసీపీలోని రెండువర్గాలు కలిసే అవకాశాలు లేవని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతుం డటం గమనార్హం. వైఎస్ఆర్ జయంతి రోజు కూడా ఒక వర్గానికి మాత్రమే అధిక ప్రాధాన్యం కల్పించారనే చర్చ జరుగుతోంది. కార్యక్రమంలో కల్లూరు ప్రతాప్‌రెడ్డి, పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, నిట్టూరు నాగేంద్ర రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ క్యాంపునకు డిగ్రీ ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న 8 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఆర్మీ అటాచ్‌డ్ క్యాంప్‌నకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లు సికింద్రాబాద్‌లో 76వ ఇన్ఫాంట్రీ (పదాతిదళం) బ్రిగేడ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే క్యాంపులో పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిలో లక్ష్మన్న, నిఖిల్, సాయినిఖిల్, బాల ఓబులేశు, వెంకటసాయికృష్ణ, పోతిరెడ్డి, ధనుష్, అహమ్మద్ ఉన్నట్లు వెల్లడించారు.

మీ కాళ్లు పట్టుకుంటా..!

కందుల కోసం వేడుకున్న రైతు... పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఈఓ



ఏఈఓ కాలికి టవల్ చుట్టి కూర్చున్న రైతు

కుందుర్పి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంట సాగు కోసం కందులు ఇవ్వాలని ఓ రైతు ఏఈఓ కాళ్లు పట్టుకున్నారు. ఆయన్ను కదలనివ్వకుండా తన టవల్‌ను ఏఈఓ కాలుకు చుట్టి భీష్మించాడు. ఈ సంఘటన కుందుర్పి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక రైతు సేవా కేంద్రానికి రైతు కేజీ గోపాల్ మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. అప్పటికే కందుల పంపిణీ ముగిసింది. ఉన్న కందులన్నీ పంపిణీ చేశామని ఏఈఓ గుణశేఖర్ రైతులకు తెలిపారు. దీంతో కందులు అందని రైతులు దిగాలుగా అక్కడే కూలబడిపోయారు. కానీ రైతు గోపాల్ మాత్రం తీవ్ర ఆవేదనలోనయ్యారు. ఎలాగైనా తనకు కందులు ఇవ్వాలని ఏఈఓను ప్రాధేయపడ్డారు. ఆయన వెళ్లిపోతుండటంతో వెంటపడి, తన భుజం మీద ఉన్న కండువాను తీసి కాలికి చుట్టి గట్టిగా పట్టుకున్నారు. తోటి రైతులు గోపాల్‌కు సర్ది చెప్పి, ఏఈఓను పంపించారు. రైతు ఆవేదనను అర్థం చేసుకోకుండా, ఏఈవో గుణశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో ఆ రైతు తన విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విత్తన బకాయిలు ఇప్పించండి

ఏపీ సీడ్స్ చైర్మన్‌కు సరఫరాదారుల విజ్ఞప్తి



ఏపీసీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న విత్తన సరఫరాదారులు

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): విత్తన సరఫరా బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన విత్తన సరఫరాదారులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఏపీసీడ్స్ కార్యాలయంలో ఆ సంస్థ మేనేజర్ సుబ్బయ్య, సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో విత్తన వేరుశనగర సరఫరా గురించి ఆరా తీశారు. అనంతరం సంస్థ ఆవరణలోని గోదాములో నిల్వ ఉన్న విత్తన వేరుశనగ బస్తాలను పరిశీలించారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన విత్తన సరఫరాదారులు చైర్మన్‌ను కలిశారు. గత ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి తమకు రూ.30 కోట్లు రావాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి మరో రూ.53 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. బకాయిలు పెరిగిపోతుండటంతో విత్తన సరఫరాకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ ఏడాది విత్తన సరఫరాలో సమస్యలు లేకుండా సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు, గోదాముల్లో వ్యవసాయ శాఖ కమిషనరేట్, విజిలెన్స్ స్థానిక వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ ఏడీఏ సాలురెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి, అనంతపురం ఏఓ వెంకట్ కుమార్, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వంశీకృష్ణ.. ఎరువుల దుకాణాల్లో స్టాక్, పలు రికార్డులు పరిశీలించారు. ఓ ఫాం లేకపోవడంతో రూ.7.25 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. మరో నాలుగు రోజులపాటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

నేడు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో ఏపీఎంలు, సీసీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే శిక్షణకు అన్ని మండలాల ఏపీఎంలు, మండలానికి ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన సీసీలు హాజరుకావాలని సూచించారు.

రాయపూర్‌లో జవాను ఆత్మహత్య

భార్యతో మాట్లాడిన కాసేపటికే ఘటన

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలే కారణం..?

స్వగ్రామం శివపురంలో విషాదం



భార్య, పిల్లలతో మురళి

కనగానపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివపురం గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను కె.మురళి(30) ఆత్మహత్య చేసుకున్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నట్లు అక్కడి అధికారులు కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి సమాచారం ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. శివపురం గ్రామానికి చెందిన ముత్యాలన్న, నాగలక్ష్మి దంపతులకు మురళి, అంజలి సంతానం. పొలాలు ఉన్నా.. పంటలు సరిగా పండకపోవడంతో కొన్నేళ్ల క్రితం వీరు బెంగళూరుకు వలస వెళ్లారు. ఫ్యాక్టరీలలో పని చేసుకుంటూ, అక్కడే కొడుకు, కూతురును బడిలో చేర్పించారు. మురళి డిగ్రీ చదువుతున్న సమయంలో సీఆర్‌పీఎఫ్‌కు సెలెక్ట్ అయ్యారు. చెల్లెలు అంజలిని చదివిస్తూనే, అనంతపురం నగరానికి చెందిన పావని అనే యువతిని వివాహం చేసుకున్నారు. వీరికి తారక్‌రామ్, మహి అనే కొడుకు, కూతురు ఉన్నారు. మురళి విధుల నిమిత్తం రాయపూర్‌లో ఉండగా, అంజలి తన ఇద్దరు పిల్లలతో అనంతపురంలోని పుట్టింట్లో ఉంటున్నారు. పావనికి ఆదివారం రాత్రి మురళి ఫోన్ చేశారు. పిల్లల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. చెల్లెలి చదువు, బిడ్డల భవిష్యత్తు, తండ్రి ఆరోగ్యం తదితర సమస్యల గురించి చర్చించి బాధపడ్డారు. ఫోన్ పెట్టేసిన కొన్ని నిమిషాలకే మురళి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఆర్‌పీఎఫ్ అధికారుల నుంచి సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. జవాను భౌతిక కాయం మంగళవారం ఉదయానికి శివపురం చేరుకుంటుందని బంధువులు తెలిపారు.

వెంటాడిన కష్టాలు..

బెంగళూరులో తల్లిదండ్రుల కష్టాలను చూసిన మురళి, చదువుతున్న సమయంలోనే జవానుగా ఉద్యోగం సాధించారు. ఉన్నత చదువుల గురించి ఆలోచించడం మానేసి, కుటుంబాన్ని గట్టెక్కించే బాధ్యతను తీసుకున్నారు. చెల్లెలిని చదివిస్తున్నారు. పరిస్థితులు చక్కబడుతున్న సమయంలో కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఆయన తండ్రి ముత్యాలన్న క్యాన్సర్ బారిన పడ్డారు. వైద్యం కోసం ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించారు. ఇటీవలే తన కారును స్నేహితుడికి ఇచ్చారు. ఆ సమయంలో ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందారు. బాధిత కుటుంబానికి మురళి పరిహారం ఇవ్వాల్సి వచ్చింది. ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారు. తన జీతపు రాళ్లతో చెల్లెలి చదువు, వివాహం, తన బిడ్డల చదువు, భవిష్యత్తు.. ఇలా అన్నింటి గురించి ఆలోచించి భార్య వద్ద బాధపడ్డారు. ఈ సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

డాక్టర్లకు వన్‌టైం ప్రమోషన్..!

అసోసియేట్ నుంచి ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి

వివరాలు సేకరించిన డీఎంఈ

అనంతపురం వైద్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉద్యోగోన్నతలకు రాష్ట్ర వైద్యవిద్య శాఖ శ్రీకారం చుట్టింది. వన్‌టైం ప్రమోషన్ కింద అసోసియేట్ ప్రొఫెసర్లకు ఉద్యోగోన్నతి కల్పించనుంది. ఈ మేరకు సోమవారం వైద్య కళాశాలల నుంచి వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) వివరాలు సేకరించారు. అసోసియేట్, అసిస్టెంట్, ప్రొఫెసర్లు, వారిలో ప్రమోషన్‌కు అర్హుల వివరాలతో విజయవాడకు రావాలని పిలుపునిచ్చారు. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్లు, పరిపాలనా విభాగానికి సంబంధించిన అధికారులు సోమవారం విజయవాడకు తరలివెళ్లారు.

లక్కీడాక్టర్లు..!

వైద్య కళాశాలలో ఉద్యోగోన్నతుల కోసం ఏళ్ల తరబడి వేచిచూడాల్సి ఉంటుంది. అర్హత, అనుభవం ఉన్నా ఉద్యోగోన్నతి రావాలంటే అదృష్టంగా భావించాల్సి ఉంటుంది. ఉన్నఫలంగా డీఎంఈ నుంచి ప్రమోషన్స్ అంటూ ప్రకటన రావడంతో కొంతమంది డాక్టర్లు లక్కీచాన్స్ కొట్టారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. అసోసియేట్‌గా వచ్చిన మూడు సంవత్సరాలకే ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందడానికి మంచి అవకాశం దొరికిందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రేడియాలజీ విభాగంలో 12 పీజీ సీట్లు రావడానికి కృషిచేసిన అసోసియేట్ ప్రొఫెసర్ ఒకరు తాజాగా నిర్వహించిన బదిలీల్లో వెళ్లారు. ఈఎన్‌టీలో ప్రొఫెసర్ పోస్టు ఖాళీ ఉండటంతో అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జి బాధ్యత అప్పగించారు. వారిద్దరూ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొంది తిరిగి అదే విభాగాల్లో పనిచేయడానికి వన్‌టైం ప్రమోషన్ దోహదపడుతుందని వైద్యవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ప్రమోషన్ మాకొద్దు..!

సూపర్ స్పెషాలిటీ, బ్రాడ్ స్పెషాలిటీ ఇలా రెండు విభాగాలుగా వైద్యవిద్య కళాశాలల్లో పనిచేస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ క్వాలిఫికేషన్‌తో ఆ ఆసుపత్రిలోనూ, బ్రాడ్ స్పెషాలిటీ కింద సర్వజన వైద్యశాలలో డాక్టర్లు పనిచేస్తున్నారు. నాన్ క్లినికల్ డిపార్ట్‌మెంట్ వైద్యులు మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు. అర్హత ఉన్నా కొంతమంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగోన్నతి వద్దంటూ వెనకడుగు వేస్తున్నారు. ప్రమోషన్‌లు ఇచ్చి ఇతర కాలేజీలకు బదిలీ చేస్తే మొదటికే మోసం వస్తుందని వారు భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

డేటా పంపించాం



అసోసియేట్ ప్రొఫెసర్లకు వన్‌టైం ప్రమోషన్ కోసం డీఎంఈ నుంచి ఉత్తర్వులు రావడంతో సంబంధిత డేటాను పంపించాం. ఫైళ్లను తయారుచేసి అధికారులు విజయవాడకు తీసుకెళ్లారు. రెండురోజులపాటు అక్కడే ఉండి ప్రమోషన్ల ప్రక్రియలో పాల్గొంటారు.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

బోగస్ సర్టిఫికెట్లతో కబ్జా

కలెక్టరేట్‌లో బాధితుడి ఫిర్యాదు



షబ్బీర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లతో రూ.అరకోటి విలువ చేసే తన స్థలాన్ని కబ్జా చేశారని బాధితుడు వాపోయాడు. గార్లదిన్నె మండలం శిరివరానికి చెందిన షబ్బీర్ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. కల్లూరులో సర్వే నంబరు 173లో రూ.50లక్షల విలువైన 6సెంట్ల భూమిని జూన్ 4వ తేదీ బాబాఫకృద్దీన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించాడు. ఇందులో అధికారులు కుమ్మక్కయ్యారన్నాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఈ నెల3న తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారని, అందులో సంబంధిత వ్యక్తికి రెండో భార్య ఉన్నట్లు తప్పుడుగా సృష్టించారని ఆరోపించాడు. 2024 సెప్టెంబరు 21న శిరివరంలోని సర్వే నంబరు 131/9లో 40 సెంట్లను బాబాఫకృద్దీన్ పేరుతోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, డీఆర్‌ను కలిస్తే దానిని రద్దు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమార్కులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నాడు.

మిగులు భూమిగా మారింది:



వెంకటనాయుడు

25సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న భూమి. తాత, తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించింది. అలాంటిది ఆన్‌లైన్‌లో కాకుండా మిగులు భూమిగా చూపిస్తోందని రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటనాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగేళ్లుగా తిరుగుతున్నా అధికారులు న్యాయం చేయలేదని వాపోయాడు. అది కలెక్టర్ లాగిన్‌లో ఉంటుందని మండల అధికారులు చెబుతున్నారన్నాడు. సోమవారం అధికారులను కలిసి సమస్య విన్నవించుకున్నాడు. సర్వే నంబరు 281లో 1-64 ఎకరాలు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో తన పేరుతో కనిపించడం లేదని తెలిపాడు. తన సోదరుడికి చెందిన భూమి ఆన్‌లైన్‌లో చూపిస్తోందన్నారు. తన భూమి మిగులు కింద చూపుతోందన్నాడు. 1బీ అడంగల్‌లో వచ్చేలా చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేయాలని కోరారు.

ఏళ్లుగా తిరుగుతున్నా...



నాగభూషణం

ఐదేళ్లకుపైగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశాడు. సర్వే నంబరు 790-2లో 4.98ఎకరాలు దీర్ఘకాలికంగా తాను సాగు చేసుకుంటున్నానని తెలిపాడు. పదేళ్ల క్రితం ఆ భూమి ధనలక్ష్మి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపాడు. విషయం ఆలస్యంగా తెలిసి అధికారులను కోరితే సమస్య పరిష్కరించలేదన్నాడు. తన భార్య శాంతమ్మ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతున్నా పట్టించుకోవం లేదని, న్యాయం చేయాలని కోరాడు.

అనాథాశ్రమం ఆక్రమణ



నిరసన తెలుపుతున్న అనాథలు

అనాథలు ఉంటున్న ఆశ్రమాన్ని కబ్జా చేశామనీ, ఖాళీ చేయాలని తహసీల్దార్, ఎంపీడీఓ హెచ్చరిస్తున్నారని బెరాకా అనాథాశ్రమంలో ఉంటున్న ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో రెవెన్యూభవన్ వెనుక వైపు బైఠాయించి నిరసన తెలిపారు. కూడేరు మండలం గొట్కూరు పరిధిలోని బెరాకా అనాథాశ్రమం తరఫున బెరాకా మినిస్ట్రీ ప్రతినిధులు శ్రీరామ్ తదితరులు.. కలెక్టర్‌కు వివరించారు. సర్వే నంబరు 69-4లో 2 ఎకరాల స్థలంలో అనుమతిస్తూ 2009లో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. తాజాగా 15 రోజుల క్రితం తహసీల్దార్, ఎంపీడీఓలు వచ్చి ఆ స్థల పరిధిలోని షెడ్డును కూల్చి వేశారన్నారు. ఈ స్థలం సర్వేనంబరు 75 అని, దీనికి అనుమతి లేదని ఖాళీ చేయమని ఆదేశాలిచ్చారన్నారు. 16 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామనీ, న్యాయం చేయాలని కోరారు.

విధుల్లోకి రాకపోతే ఎస్మా

● కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి పథకం కింద పనిచేస్తున్న కార్మికులు మంగళవారం నుంచి విధుల్లోకి రాకపోతే ఎస్మా చట్టం ప్రయోగిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం రూ.3.83కోట్ల డబ్బు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లో సోమవారం జమ అయ్యిందన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కార్మికులకు 16నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో కార్మికులకు అన్ని చెల్లింపులు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. తాగునీటి పథకం కింద ముగ్గురు కాంట్రాక్టర్లకు రూ.16కోట్ల డబ్బు చెల్లించినట్లు తెలిపారు.

పని ప్రదేశాల్లో పోష్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం(పోష్)ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆ ధ్వర్యంలో పనిచేసే చోట మహిళలపై లైం గిక వేధింపుల(నివారణ నిషేదం, దిద్దుబాటు)చట్టం-2013పై రూపొందించిన ప్రచార వాల్ పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఈ చట్టంలోని సెక్షన్-4 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెల్ప్‌లైన్ 181కు ఫోన్‌కాల్ చేసి మహిళల సమస్యలను తెలపవచ్చన్నారు. అనంతరం రెవెన్యూభవన్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ సేవల గురించి బొమ్మలు, వీడియోలతో చెప్పండి

వివిధ రకాల రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవల గురించి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలను అందించే అర్జీదారులకు అర్థమయ్యే భాషలో బొమ్మలు, వీడియోలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ అంటే ఏంటి.?, చుక్కల భూమి, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కోర్టులు, మిగులు భూమి అంటే ఏంటి..?, సరిహద్దులు చూపించడం, భూమి ఆక్రమణ, జాయింట్ ఎల్‌పీఎంలు, రీ సర్వేలో విస్తీర్ణం తగ్గడం, అలైన్‌మెంట్, వెబ్‌లాండ్ కరెక్షన్, ఇళ్ల పట్టా తదితర అంశాలపై పూర్తిగా అవగాహన కలిగేలా బొమ్మలను గీయాలని, వీడియోలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమాల్లో జేసీ శివనారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీవీ విభాగం కౌన్సిలర్ ఉమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శిరీష, ఎస్ఈ పీఏ రామారావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం తగదు

24గంటల్లో పీ-4పై నివేదిక ఇవ్వండి


అధికారులపై కలెక్టర్ అసహనం

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 బంగారు కుటుంబానికి సంబంధించి అధికారుల అలసత్వంపై కలెక్టర్ వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. పీ-4 విషయంలో లక్ష్యం చేరుకోకపోతే చర్యలు తప్పవన్నారు. 24 గంటల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నిధులున్నా కొన్ని శాఖల్లో పనులు ఎందుకు చేపట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ పాఠశాలల్లో వీలైనంత వరకు విద్యార్థులకు అడ్మిషన్ కల్పించాలని ఆదేశించారు.

800 వినతులు...

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 800 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, ఆనంద్, తిప్పేనాయక్, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ అర్జీలను స్వీకరించారు.

జాతీయ హాకీ జట్టుకు కదిరి బాలిక



సీవీ లక్షిత

కదిరి అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ జట్టుకు కదిరికి చెందిన విద్యార్థి సీవీ లక్షిత ఎంపికయ్యారు. ఇటీవల హరియాణాలోని హీసర్‌లో జరిగిన ఆల్‌ఇండియా ఐపీఎస్‌సీ బాలికల అండర్- 17 ప్రీ నెహ్రూ కప్ పోటీల్లో ఈమె కిట్టూరులోని రాణీ చెన్నమ్మ సైనిక్ స్కూల్ తరఫున పాల్గొన్నారు. ఈ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉత్తమ గోల్‌కీపర్ అవార్డు గెలుచుకున్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన లక్షితను జాతీయ అండర్-16 హాకీ జట్టుకు ఎంపిక చేశారని సైనిక్ స్కూల్ కోచ్ జయలక్ష్మి తెలిపినట్లు లక్షిత తండ్రి డాక్టర్ సీవీ మదన్‌కుమార్ సోమవారం తెలిపారు.

నేడు పెన్షనర్ల ధర్నా

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్, కార్యదర్శి జయరామప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతోపాటు ప్రవేశట్టిన వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలన్నారు. కేంద్రంలో 8వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు, డీఆర్ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఏడుగురి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల, జూలై14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందుల గ్రామంలో ఈనెల 3న జరిగిన మైలే శంకరయ్య హత్య కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ విజయ్‌కుమార్, సీఐ కౌలుట్లయ్యతో కలిసి డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. ఈనెల 3వ తేదీన మైలే శంకరయ్య మనవ రాలు శ్యామల ఇంటి వెనుక ఉన్న దారికి ముళ్లకంపలు అడ్డంగా వేసింది. ఈ విషయమై పక్కనే నివాసం ఉంటున్న దాసరి ప్రభాకర్ భార్య సరస్వతి, తల్లి రత్నమ్మ అదే రోజు మధ్యాహ్నం శ్యామలతో గొడవపడ్డారు. సాయంత్రం ఇంటికొచ్చిన ప్రభాకర్‌కు విషయం చెప్పారు. దీంతో ప్రభాకర్, అతడి తమ్ముడు త్రినాథ్, బంధువులు రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు, సరస్వతి, రత్నమ్మ కలిసి కట్టెలు, రాళ్లు తీసుకుని శ్యామల భర్త మల్లికార్జునను వెతుక్కుంటూ శంకరయ్య ఇంటి వద్దకెళ్లారు. 'మల్లికార్జున ఎక్కడ?' అంటూ నానా దుర్భాషలాడారు. కొన్ని రోజుల్లో పీర్ల పండుగ ఉందనీ, ఈ సమయంలో గొడవలు వద్దనీ, సమస్య ఉంటే తరువాత మాట్లాడుకుందామని శంకరయ్య సర్దిచెప్పినా వినలేదు. ఆగ్రహంతో ఉన్న ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు కలిసి శంకరయ్య, అతడి బంధువులు బాలగంగిరెడ్డి, నాగేంద్ర, అమ్ములన్న, పెద్దరాజుపై కట్టెలతో దాడి చేశారు. శంకరయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా దాసరి ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులును మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

విద్యుదాఘాతానికి కౌలు రైతు బలి



పెద్దారెడ్డి (ఫైల్)

యల్లనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామా నికి చెందిన బసిరెడ్డి పెద్దారెడ్డి (49) విద్యుదాఘాతంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దారెడ్డి లక్షుంపల్లి గ్రామ సమీపంలో 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంటకు నీరు పెట్టడానికి రాత్రి 10గంటల సమయంలో ఇంటి నుంచి తోటకు వెళ్లాడు. అక్కడ మోటారు ఆన్ చేయడానికి స్టార్టర్‌లోకి వెళ్లే వైర్లు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటి తర్వాత పొలం వద్దకు వెళ్లిన పెద్ద కుమారుడికి తండ్రి కనిపించలేదు. దీంతో పొలం అంతా వెదికాడు. చివరకు స్టార్టర్ పెట్టె వద్ద విగతజీవిగా పడి ఉన్న తండ్రి కనిపించడంతో బోరుమంటూ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమారులు సాయిప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి ఉన్నారు. కుమారుడు సాయిప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు

గుత్తి, జూలై14(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్ రోడ్డులో సోమవారం ఆటో బోల్తా పడి ఎరుకలప్ప(65) అనే వ్యక్తి మృతిచెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. కర్ణాటకలోని హోస్పేటకు చెందిన ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప సొంతూరి నుంచి రైలులో గుత్తి ఆర్ఎస్‌కు వచ్చారు. వారు పెద్దవడుగూరుకు వెళ్లాల్సి ఉంది. ఆర్ఎస్ నుంచి గుత్తికి వచ్చేందుకు ఆటో ఎక్కారు. అదే ఆటోలో గుత్తికి చెందిన విజయలక్ష్మి, గుత్తి ఆర్ఎస్‌కు చెం దిన రాజు కూడా ఎక్కారు. కేంద్రీయ విద్యాలయం సమీపాన కుక్క అ డ్డువచ్చింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపుతప్పి బోల్తా ప డింది. ప్రమాదంలో ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప, విజయలక్ష్మి, రాజు గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎరుకలప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఏర్పాట్ల కోసం వెళితే చోరీ

- కారులో ఉంచిన రూ.ఏడు లక్షల అపహరణ



అనుమానితులు

గోరంట్ల, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పట్టపగలే కారులోని రూ.ఏడు లక్షలు గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన స్థానిక శ్రీవాసవీ మహల్ వద్ద సోమవారం జరిగింది. మండలంలోని మల్లాపల్లి బీపీఎం (బ్రాంచ్ పోస్టుమాస్టర్)రామచంద్రరావు కుమారుడి పెళ్లి నవంబరులో చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లలో భాగంగా బంగారం కోసం అడ్వాన్సు ఇవ్వడానికి రామచంద్రరావు అతడి సోదరుడు రిటైర్డ్ వీఆర్ఓ వసంతరావు, కుమారుడు నాగతేజ ముగ్గురు కారులో గోరంట్లకు వచ్చారు. ఉదయం 11.30గంటల సమయంలో స్టేట్‌బ్యాంక్‌లో రూ.ఏడు లక్షల డ్రా చేసి కారులోనే బంగారం దుకాణానికి వెళ్లారు. షాపు యజమాని లేకపోవడంతో నేరుగా వాసవీమహల్‌వద్దకు వెళ్లి రహదారి పక్కన కారు ఆపారు. నగదు మొత్తాన్ని కారులో ఉంచి, అద్దాలు లాక్ చేసి, కల్యాణమండపాన్ని పరిశీలించడానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కారు ముందు ఎడమవైపు ఉన్న అద్దం పగలకొట్టి డబ్బు చోరీ చేసినట్లు బాధితులు చెప్పారు. సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు పల్సర్ వాహనాల్లో నలుగురు వ్యక్తులు బ్యాంక్ వద్ద నుంచి కారును వెంబడించినట్లు బాధితులు తెలిపారు. పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిబ్బందిని అప్రమత్తం చేసి, సీసీపుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

పెళ్లి కాలేదని నమ్మించి..!

- విడాకులు పొందిన మహిళతో రెండో పెళ్లి
- డబ్బు, బంగారం కాజేసి.. ప్లేటు ఫిరాయింపు
- పోలీసులను ఆశ్రయించిన గర్భిణి



పోలీసుస్టేషన్ వద్ద బాధితురాలు, కుటుంబ సభ్యులు, నాయకులు

గుంతకల్లు టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదని నమ్మించి, తనను వివాహం చేసుకుని మోసగించాడని గుంతకల్లు పట్టణానికి చెందిన వీఆర్వో మహ్మద్ అలీపై షేక్ షమీమ్ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులతో కలిసి బాధితురాలు న్యాయం కోసం గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు ఆశ్రయించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు, గుంతకల్లు భాగ్యనగర్‌కు చెందిన పీరాన్ కూతురు షేక్ షమీమ్ బానుకు 2017లో రాయచూర్‌కు చెందిన షామీర్‌తో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు అబ్బాస్ అలీ ఉన్నాడు. దంపతుల మధ్య విభేదాల కారణంగా 2023లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి షమీమ్ తనక కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. రేషన్ కార్డులో తన కుమారుడి పేరు చేర్చాలని గుంతకల్లు మున్సిపాలిటీలోని 24వ సచివాలయంలో ఆమె సుమారు ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశారు. అక్కడ వీఆర్వో మహ్మద్ అలీ పరిచయమయ్యాడు. అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని, రెండు రోజుల తరువాత రమ్మని సూచించాడు. ఈ క్రమంలో ఆమె గత జీవితం గురించి తెలుసుకుని పరిచయం పెంచుకున్నాడు. 'నీకూ మంచి రోజులు వస్తాయి.. బాధపడకు' అని ఓదార్చాడు. ఇంటి స్థలం, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష తీసుకున్నాడు. ఆ తరువాత మాయ మాటలు చెప్పి, గత ఏడాది మే 22న అనంతపురానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం షమీమ్ ఏడు నెలల గర్భిణి. ఈ విషయం తెలుసుకున్న మహమ్మద్ అలీ మొదటి భార్య నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులు నెల క్రితం షమీమ్ వద్దకు వచ్చి గొడవపడ్డారు. ఆమెను దూషించి, దాడి చేసి వెళ్లారు. దీంతో మహమ్మద్ అలీకి ఇది వరకే వివాహం జరిగిన విషయం షమీమ్‌కు తెలిసింది. ఈ విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ సమయంలో తన భర్త మహమ్మద్ అలీ, ఆయన మొదటి భార్య, ఆమె అన్నలు, వదినలు తనను అసభ్య పదజాలంతో దూషించారని, తన తండ్రిని చంపేస్తామని బెదిరించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మహమ్మద్ అలి తన బంగారాన్ని యాంకర్ వెల్ఫేర్ బెంగళూరు బ్రాంచిలో తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడని వాపోయారు. ఆ డబ్బులను రెండింతలు చేస్తానని నమ్మించి మోసగించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, అతని మొదటి భార్య ఆమె అన్నలు, వదినలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరకాస్తు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకునన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. మార్గదర్శకాలకు సంబంధించిన వివరాలు డీఈఓ బ్లాగ్‌లో ఉంచామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తర్వాత ఉన్నతాధికారి ధ్రువీకరణతో ఈనెల 16వతేదీ సాయంత్రంలోపు చేసిన ఆ దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీఈఓ కోరారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ రకం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1275 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు వివరించారు.

20న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగాల్లో సెలెక్షన్స్ ఉంటాయని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులు తెలిపారు. 2010 జనవరి 2వతేదీ తరువాత జన్మించిన వారు సబ్‌జూనియర్, 2006 జనవరి 2 తరువాత జన్మించిన వారు జూనియర్ విభాగానికి అర్హులన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9966188133 నంబరులో సంప్రదించాలని కోరారు.

గూడ్స్‌రైలు ఢీకొని రైతు మృతి

చెన్నేకొత్తపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆ మిదాలకుంట సమీపాన ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని రైతు రామాంజనేయులు (43) మరణించాడు. హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సి.ఆమిదాల కుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు తోట వద్దకెళ్లాడు. పనిముగించుకుని తిరిగి ఇంటికి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం రైల్వే పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ద్వారా మృతదేహన్ని గుర్తించిన తరువాత పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రామాంజనేయులుకు భార్య శమంతకమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణం వద్ద ప్రమాదవశాత్తు ఓ బాలిక విద్యుదాఘాతంతో సోమవారం తీవ్రంగా గాయపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ...ఒంగోలు నుంచి హరి, రాధిక దంపతులు మూడు నెలల కిందట కూలి పనుల కోసం వలస వచ్చారు. ఈక్రమంలో శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి కూలి పనులకు తమ కుమార్తె వెంకటేశ్వరితో కలిసి వెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమవ్వగా, వెంకటేశ్వరి అక్కడే ఆడుకోవడం ప్రారంభించింది. ఈక్రమంలో అక్కడ ఇనుపరాడ్లకు కరెంటు సరఫరా అవుతుండటాన్ని గమనించని బాలిక దాన్ని తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదరగొట్టిన అనంత బౌలర్లు

- నెల్లూరు 237 ఆలౌట్
- నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభం



వినయ్‌కుమార్



జై కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనంత బౌలర్ల ధాటికి నెల్లూరు బ్యాటర్లు చేతులెత్తేశారు. వినయ్‌కుమార్, జైకృష్ణ చెరో నాలుగు వికెట్లు పడగొట్టడంతో నెల్లూరు కోలుకోలేకపోయింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్‌తేజ (62), రోషన్ పవన్‌కుమార్ (55) హాఫ్ సెంచరీలు చేశారు. అనంతపురం బౌలర్లు వినయ్‌కుమార్, జైకృష్ణ చెలరేగిపోయారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆటముగిసే సమయానికి 23 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. చైత్రవర్ధన్ (55), రోహిత్‌రోషన్ (29) రాణించారు. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్ల మధ్య పోటీ సాగుతోంది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. తౌఫీక్ హుస్సేన్ (49), మురళి (40), ఇస్మాయిల్ (44), అంజనేయులు (31) ఫర్వాలేదనిపించారు. కడప బౌలర్లు పఠాన్‌షరీఫ్ 4, అరీఫ్‌బాషా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 23 ఓవర్లలో వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. వంశీకృష్ణ అజేయ హాఫ్ సెంచరీ (77)తో కొనసాగుతున్నాడు.

రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలే 'అనంత'లక్ష్మి లక్ష్యం

- ప్రతి సంవత్సరం 400కుపైగా ప్లేస్‌మెంట్స్
- 4 గదులు, 240 మంది విద్యార్థులతో ప్రారంభం
- నేడు 8 బ్రాంచ్‌లు, 1380 బీటెక్ ఇంజనీరింగ్ సీట్లు
- అటానమస్ కళాశాల నుంచి వర్సిటీవైపు అడుగులు
- అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అంతరాముడు



అనంతపురం వైద్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యవసాయ కుటుంబంనుంచి వచ్చిన అనంతరాముడు 1972లో బీఏ డిగ్రీ పూర్తిచేసి బ్యాంక్ ఉద్యోగానికి హైదరాబాద్ బయలుదేరాడు. అప్పటికే తాత, తండ్రికి వ్యవసాయంలో తోడుగావుంటూ పంటల దిగుబడిని మద్రాసు మార్కెట్‌లో అమ్మివచ్చేవాడు. సొంతూరితోపాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు మనమే వ్యవసాయకూలీ పనిని కల్పిస్తున్నాం, పదిమందిని జీతం పెట్టుకున్నాం. మనం ఇంకొకరివద్దకు జీతం వెళ్లడమేంటని వారు అడ్డుకున్నారు. జీతానికి వెళ్లడంకాదు జీతాలు ఇచ్చేస్థాయికి మనం ఎదగాలన్న కుటుంబ పెద్దల సూచన అనంతరాముడి ఆలోచన మార్చివేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయంలోని లోపాలను గుర్తించి అధునాత పద్ధతిలో పంటలు పండించేస్థాయికి చేరుకున్నాడు. అన్నదానం కంటే విద్యాదానం గొప్పదని భావించిన అనంతరాముడు.. విద్యారంగంవైపు ప్రయాణించారు. ఎస్కేయూ దగ్గర ఇటుకలపల్లి సమీపంలోని బైస్ రోడ్డు పక్కన అనంతలక్ష్మి విద్యాసంస్థల పేరుతో 2008లో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేశారు. నాలుగు గదులు, 240మందితో బీటెక్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించి నేడు 8 బ్రాంచ్(కోర్సు)లు, 1380సీట్లతో అటానమస్(స్వయం ప్రతిపత్తి) కళాశాలగా తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం 400మందికిపైగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తూ వారిని సొంతకాళ్లపై నిలబెడుతున్నారు. కళాశాలలో మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అధునాత ల్యాబ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో జాతీయ సంస్థలైన న్యాక్, ఎన్‌బీఏ, ఐఎస్ఓ అక్రిడిటేషన్ గుర్తింపునిచ్చాయి. అటానమస్ కళాశాలనుంచి వర్సిటీవైపు అడుగులు వేస్తున్న కళాశాలలో బీటెక్ ఇంజనీరింగ్‌తో విద్యార్థుల బవిష్యత్‌పై 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను అనంతరాముడు పంచుకున్నారు.

ప్ర: విద్యార్థులకు ఉద్యోగాలే లక్ష్యంగా ఏం చేస్తున్నారు?

జ: తల్లిదండ్రులు వారి పిల్లలు ప్రయోజకులుగా కావాలని మా కళాశాలలో చేర్పిస్తున్నారు. వారికి పాఠాలునేర్పి పాస్‌కాగానే సర్టిఫికెట్స్‌ను అందజేసి పంపితే వారి ఆశలు నెరవేరవు. ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్‌ను డెవలప్‌చేసి కళాశాలలోనే క్యాంపస్ సెలెక్షన్స్ చేపడుతున్నాం.

ప్ర: ఎంతమందికి ఉద్యోగాలొస్తున్నాయి?

జ: ప్రతి విద్యార్థికి ఉద్యోగం వస్తుంది. ప్రతి సంవత్సరం 400మందికిపైగా ఉద్యోగాలకు వెళ్తున్నారు. మిగిలినవారు ఇంకా పైచదువులకు వెళ్తున్నారు. రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వార్షిక వేతనం(ప్యాకేజ్)తో ఎంపికవుతున్నారు. భవిష్యత్తులో రూ.20లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు అమలుచేశాం.

ప్ర: కళాశాలలో ఏయే బ్రాంచ్‌లు ఉన్నాయి?

జ: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో డేటా సైన్స్(సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(సీఏఐ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్(ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఐవీ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈసీ) మొత్తం ఎనిమిది బ్రాంచ్‌లున్నాయి.

ప్ర: బ్రాంచ్‌కు ఎన్ని సీట్లున్నాయి, ఫీజు ఎంత?

జ: సీఎస్ఈ 540, సీఎస్‌డీ 60, సీఎస్ఎం 300, సీఏఐ 60, ఈసీఈ 300, ఈఈఈ 60, సీఐవీ 30, ఎంఈసీ 30 మొత్తం 1380 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద చేరే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌ను చెల్లిస్తుంది.

ప్ర: కౌన్సెలింగ్‌లో కళాశాలను ఎలా ఎంచుకోవాలి?

జ: ఏపీఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇప్పటికే కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. ఇక కళాశాల, బ్రాంచ్ ఎంపికలు మొదలుపెట్టారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల కోడ్ 'ALTS' ను ఎంపిక చేసుకుని, వారికి నచ్చిన బ్రాంచ్‌కు టిక్ పెట్టాలి. మొదటి ప్రాధానత్యగా 'ALTSకు ఆప్షన్ ఇచ్చుకుంటే సీట్ అలార్ట్‌మెంట్ అవుతుంది.

ప్ర: పాఠ్యాంశాల రూపకల్పన?

జ: అకడమిక్ సిలబస్‌ను జేఎన్టీయూ రూపొందిస్తుంది. అయితే వాటిలో మార్పుచేసుకునే అవకాశం అటానమస్ అయిన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను ఫ్రేమ్‌చేస్తున్నాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందే అంశాలు. సొంతంగా పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన అంశాలతో కూడిన పాఠాంశ్యాలను రూపొందిస్తున్నాం.

హెచ్చెల్సీకి నవంబరు వరకు నీరు

- సరిహద్దులో కాలువను పరిశీలించిన ఎస్ఈఈ



సరిహద్దులో కాలువను పరిశీలిస్తున్న డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్

బొమ్మనహాళ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలను నవంబరు ఆఖరి వరకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తుంగభద్ర డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్, ఎస్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బొమ్మనహాళ్ సరిహద్దు వరకు హెచ్చెల్సీని సోమవారం వారు పరిశీలించారు. తుంగభద్ర జలాలను ఈ నెల 10న విడుదల చేసిన నేపథ్యంలో కాలువ స్థితిపై పరిశీలించినట్లు వారు తెలిపారు. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. ఆంధ్ర వాటా 18 టీఎంసీలు నీరు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాం నుంచి 1400 క్యూసెక్కులు వదలగా సరిహద్దు 105 కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కులు నీరు వస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర ఎగువ కాలువలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిని తీసుకోవడంలో మరి కొద్ది రోజులు ఆలస్యం కావచ్చని వారు తెలిపారు.

విషపు గుళికల ఘాటుతో విద్యార్థిని మృతి



శివప్రియ(ఫైల్)

తాడిపత్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విషపు గుళికల ఘాటు తగిలి మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని శివప్రియ (14) మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకుం బందార్లపల్లికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె శివప్రియ బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. రోజూ ఇంటి నుంచి బడికి వెళ్లి వచ్చేది. ఈక్రమంలో సోమవారం ఉదయాన్నే పూజ చేసి స్కూలుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇల్లు శుద్ధి చేయడానికి పూనుకుంది. పురుగు పట్టకుండా ఉండటానికి విషపు గుళికలు కలిపి దాదాపు 50 బస్తాల వేగశనగకాయలు ఇంట్లోనే ఒక గదిలో నిల్వ ఉంచారు. అయితే ఏమరుపాటుతో శివప్రియ ఆ గది తలుపు తెరిచింది. ఒక్కసారిగా గుళికల ఘాటు బాలిక ముక్కును తాకింది. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తల్లిదండ్రులు గమనించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా, చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

11 సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీ)లకు త్రిసభ్య కమిటీల పాలకవర్గాలను నియమిస్తూ సోమవారం రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీల పదవీకాలం నెలాఖరు వరకు ఉంటుంది.

త్రిసభ్య కమిటీల వివరాలు..

సొసైటీ	చైర్మన్	సభ్యులు
మామడూరు	సురేష్	కర్ణ, రామకొండయ్య
తొండపాడు	శివశంకర	రమణ, సుంకన్న
గుంతకల్లు	మస్తానప్ప	సుబ్బయ్య, శివశంకర్ రెడ్డి
పి కొత్తపల్లి	శ్రీనివాసరెడ్డి	పద్మావతి, ఖాదర్‌బాషా
గార్లదిన్నె	విశ్వనాథనాయుడు	ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి
ఎర్రగుంటపల్లి	జయరామిరెడ్డి	బ్రహ్మయ్య, విశ్వనాథ్
యాడికి	చలమారెడ్డి	ఓబులేసు, మనోహరచౌదరి
చాపిరి	నారాయణ	శ్రీరాములు, నాగన్న
గొల్లపల్లి	గురుమూర్తి	దాదాపీర్, కవితమ్మ
డి కొండాపురం	వీరభద్ర	రామాంజనేయులు, గంగాధరశెట్టి

వీకే పార్వతమ్మ మృతి తీరనిలోటు: సీపీఎం



వీకే పార్వతమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ మృతి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. వీకే పార్వతమ్మ (101) ఆదివారం మొదటిరోడ్డులోని తన నివాసంలో వయోభారంతో తుదిశ్వాస విడిచారు. సోమవారం వామపక్ష, అనుబంధ సంఘాల నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం గుత్తిరోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ తదితరులు వీకే పార్వతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... వీకే పార్వతమ్మ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. మహిళా ఉద్యమ పోరాటాల్లో ఆమె కృషి మరువలేనిదన్నారు. అనేకమంది కమ్యూనిస్టు కార్యకర్తలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. భర్తకు తోడుగా ఉంటూనే కార్యకర్తలు, నాయకులను కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామిరెడ్డి, ఐద్వా నేత చంద్రిక పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రావణమాస ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు

కదిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలపరిధిలోని ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి శ్రావణ మాస ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రావణమాసం ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, ఆలయ ఈఓ మురళీక్రిష్ణ, అర్చకులు నాగరాజు, ఆంజనేయదాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి అనారోగ్యంతో మరణించిన టీడీపీ సీనియర్ మహిళా కార్యకర్త బళ్లారి నాగరత్నమ్మ కుటుంబానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ రూ.40వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం స్థానిక గాంధీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మృతురాలి భర్త బళ్లారి వెంకటేశ్‌కు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి తదితరులు ఆ సొమ్మును అందజేశారు. టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, అడ్డా మహేశ్, చిన్నూరు విజయ్‌చౌదరి, అమరాసుధాకర్, అనిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి...

బత్తలపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని యర్రాయపల్లి అంగన్‌వాడీ కార్యాకర్త, యునియన్ లీడర్ వాసంతి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న సీడీపీఓ సరస్వతి సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి వాసంతి మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రభుత్వం తరుపున అంత్యక్రియలకు రూ. 15వేలును ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న నివాళి అర్పించారు.

నివాస స్థలం సమస్య పరిష్కారం

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిధిలోని గంతిమర్రి గ్రామానికి చెందిన కుమారి పోలేరమ్మ నివాస స్థలానికి సంబంధించిన సమస్యను పరిష్కరించినట్టు ఆర్డీఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంతిమర్రి గ్రామంలో పోలేరమ్మకు చెందిన నివాస స్థలంలో కొందరు అనధికారికంగా ప్రహరీ, మెట్లు, కరెంటు వైర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమస్యపై ఆరేళ్లగా సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. దీంతో ఆమె కలెక్టర్‌ను ఆశ్రయించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల ద్వారా పరిశీలించి కొందరు అక్రమంగా నిర్మించిన ప్రహరీ, మెట్లు, కరెంటు తీగలను తొలగించాం. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా, అధికారులచే స్థలాన్ని కొలతలు వేసి స్పష్టమైన హద్దులను గుర్తించామని ఆర్డీఓ పేర్కొన్నారు.

25వ వార్డులో డ్రైనేజీ కాలువల శుభ్రం

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో డ్రైనేజీ కాలువలు చెత్తచెదారంతో నిండటంతో పాటు అక్కడి నుంచి దుర్వాసన, దోమల బెడదను భరించలేకపోతున్నామని కాలనీవాసులు ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడుదృష్టికి తెచ్చారు. ఆయన సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కు మార్‌తో మాట్లాడి పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలను, ఇళ్ల మధ్య ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు.

శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన

అమడగూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సోమవారం శక్తి టీమ్ యాప్‌పై ఆ టీమ్ పోలీసులు స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, బాలికలు, మహిళలపై జరుగుతున్న ఆఘాయిత్యాలను పోలీస్‌శాఖకు చేరవేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాబాఫకృద్దీన్, హెడ్‌కానిస్టేబరల్ రమణ, ప్రభావంతి, కానిస్టేబుల్ చందన పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పరిశీలన

కొత్తచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ వి. రత్న ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమరాల ద్వారా పర్యవేక్షణకు సీఐ మారుతిశంకర్ ఆధ్వర్యంలో కొత్తచెరువు పోలీసులు సోమవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సమీపంలోని పొలాల్లో, కొండ సమీపంలో అసాంఘిక కార్యకలాపాలపై వివరాలను సేకరించడానికి డ్రోన్ ద్వారా నిఘా ఉంచామని సీఐ తెలిపారు.

పోలీసుల పల్లె నిద్ర



టి.సదుంలో పల్లెనిద్రలో పాల్గొన్న డీఎస్పీ, ఎస్ఐ, సీఐ

తనకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం గ్రామంలో ఆదివారం రాత్రి కదిరి డీఎస్పీ శివరానాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల పీర్ల పండుగ సందర్భంగా గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గ్రామంలో పల్లె నిద్ర ఏర్పాటుచేశారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. చిన్నచిన్న సంఘటనల పట్ల సంయమనం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపి, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ఓబుళదేవరచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల గంగిరెడ్డిపల్లిలో తమ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగలు ఆదివారం రాత్రి ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం పొలంవెళ్లి చూడగా... ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్‌వైర్‌ను చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల చాలామంది రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుళదేవరచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి-హిందూపురం రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సంజీవ కాలనీ నుంచి హైవే రోడ్డు దాటుతుండగా, కొండకమర్ల వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సంజీవ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్సల కోసం అనంతపురం తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉన్నది నాలుగు.. ఆన్‌లైన్‌లో వంద

- వాస్తవంగా ఉన్న భూమి కంటే అధికంగా నమోదు
- నిజమైన లబ్ధిదారులకు అందని తల్లికి వందనం
- పేదల కడుపుకొట్టిన అధికారుల నిర్లక్ష్యం



తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయం

తాడిమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం పథకంలో స్థానికంగా జరుగుతున్న చిన్నచిన్న పొరపాట్ల వల్ల వాస్తవ లబ్ధిదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. వాస్తవానికి నాలుగు ఎకరాలు ఉన్న వ్యక్తి భూమిని అధికారుల తప్పిదంతో వంద ఎకరాలుగా ఆన్‌లైన్‌లో చూపించారు. దీంతో వారికి తల్లికి వందనం డబ్బు అందకుండా పోయింది. ఎల్‌పీసీ నెంబర్ల కేటాయింపుపై పూర్తి అవగాహన లేకుండా కొందరు రెవెన్యూ సిబ్బంది భూముల రీసర్వేలో పాల్గొనడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం మొదటి విడతగా తల్లికివందనం పథకానికి సంబంధించి అర్హుల జాబితా విడుదల చేసి, గత నెల 5వ తేదీన రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమచేసింది. అప్పట్లో తాడిమర్రి మండలానికి చెందిన 3435 మందికి రూ.4,46,55,000 జమచేసింది, ఇంకా 884 మందిని అనర్హులుగా తేల్చారు. వీరు మరొక సారి దరఖాస్తు చేసుకునేందుకు మొదట్లో 20వ తేదీ వరకు, ఆ తరువాత జూలై 5వతేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ నెల రోజుల్లో తప్పులు సరి చేసి సరైన డాక్యుమెంట్లను అందజేసిన వారికి ప్రభుత్వం మళ్లీ ఈనెల 10 నుంచి 12వతేదీ వరకు తల్లికి వందనం డబ్బులు జమచేసింది. అధికారులకు అవగాహన లేకపోవడం వల్ల సరైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయని చోట మాత్రం దరఖాస్తులు మళ్లీ తిరస్కారానికి గురయ్యాయి. తనకు ఉన్నది నాలుగు ఎకరాలైనా వంద ఎకరాలకు పైగా ఉన్నట్టు చూపడంతో తన దరఖాస్తును తిరస్కరించారని గత నెల 12న మండలంలోని ఏకపాదంపల్లికి చెందిన చిరంజీవి పిన్నదరి గ్రామ సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. అతడి కుమార్తె పూజ నారసింపల్లిలోని జాస్తి వెంకటయ్య మెమో రియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. అదేగ్రామానికి చెందిన బాలకృష్ణది అదే పరిస్థితి. రెండు ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో పదిన్నర ఎకరాలు చూపడంతో అనర్హులుగా తేల్చారు. అతడి కుమారులు నవీన్‌కుమార్ ఏడో రతగతి, శశాంక్ మూడో తరగతిని బత్తపల్లిలోని ఓ ప్రవేటు స్కూల్‌లో చదువుతున్నారు. తాము కష్టపడి ఇతరుల వద్ద కొనుగోలు చేసిన రెండెకరాల పట్టా భూమిని రీసర్వే పుణ్యాన స్థానిక అధికారుల తప్పిదంతో పదిన్నర ఎకరాలుగా మార్చారని బాలకృష్ణ వాపోతున్నాడు. ఇలాంటి తప్పిదాలతో పిన్నదరి గ్రామ పంచాయతీ పరిధిలోనే దాదాపు 60 మంది అర్హులకు తల్లికివందన పథకం అమలు కాలేదు. కాగా స్థానిక సచివాలయాల వద్దకు వెళ్లి తమ వివరాలు సరిగా నమోదు చే యించాలని కోరితే తాము బదిలీపై ఉన్నాం, మరో రెండు రోజులు ఆగి రండి కొత్తవారు వస్తారని జారుకుంటున్నట్లు బాధితులు తెలిపారు. లేదంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పరిష్కరించుకోండని ఉచిత సలహా ఇస్తున్నారని చెప్పారు. కాగా దాడితోట, అగ్రహారం, నిడిగల్లు, కునుకుంట్ల రెవెన్యూ గ్రామాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తప్పులు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంద ఎకరాలుగా నమోదైంది..



నాకు ఏకపాదంపల్లి 73-1 సర్వే నంబరులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇది పట్టా భూమి. కానీ రీసర్వే పుణ్యాన 107 ఎకరాలుగా ఆన్‌లైన్‌లో నమోదైంది. అదేమని అడిగితే ఎల్‌పీ నెంబరు తప్పుపడిందని అంటున్నారు. మరోసారి ప్రభుత్వం అవకాశం ఇస్తే తప్ప తాము నంబరు మార్చలేమని రెవెన్యూ సిబ్బంది పేర్కొంటున్నారు.

- చిరంజీవి, ఏకపాదంపల్లి

తల్లికి వందనం సొమ్ముతో ఫీజు కడదామనుకున్నా



మా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం డబ్బులు వస్తే ఫీజులు కడదామని అనుకున్నా. కానీ మాకు రెండు ఎకరాలు ఉంటే ఆన్‌లైన్‌లో పదిన్నర ఎకరాలుగా నమోదైంది. దీనిని పరిష్కరించే నాథుడే కరువయ్యాడు.

- బాలకృష్ణ, ఏకపాదంపల్లి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ పరిధిలోని రాయలవారిపల్లిలో నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఐదో వార్డులో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. శాశ్వత తాగునీటి పరిష్కారానికి రూ. 3 లక్షలతో బోర్‌బావి తవ్వకాన్ని మునిసిపల్ ఛైర్మన్ ఓబులపతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి జయంతి వేడుకలకు పట్టణానికి కొత్త శోభ తెస్తామన్నారు. వెస్టు గేట్ రోడ్డు నిర్మాణానికి రూ.88లక్షలు, మున్సి పాలిటీలో రహదారుల నిర్మాణానికి రూ.75 లక్షలు, వీధిలైట్ల ఏర్పాటుకు రూ.10లక్షలు మంజూరుచేసినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌కు సూచించారు. పుడా పార్కుల అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్ కింద జాయ్‌లుకాస్ కంపెనీ ద్వారా రూ.1.20లక్షలు ఖర్చుచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పడమర గేట్ సమీపంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ మంజూరైందని సత్య సాయి సెంట్రల్‌ట్రస్టు భూమిని కేటాయిస్తే పనులు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రత్నప్ప చౌదరి, కౌన్సిలర్ లక్ష్మీపతి, మునిసిపల్ ఇంజనీర్ నరసింహమూర్తి, టీడీపీ నాయకులు రామాంజినేయులు, గంగాధరనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు పీసీగంగన్న, బెస్త చలపతి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఓబులేసు, జయప్రకాష్, పుల్లప్ప, దాసరి నాగభూషణ, సురేష్‌చౌదరి, మురళి, రామారావు పాల్గొన్నారు.

జగన్ భూతాన్ని మద్యంసీసాలో బంధిస్తాం

- ఎమ్మెల్యే కందికుంట



27వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రూ. వేల కోట్లు హవాలా జరిగిందని, ఇందుకు కారణమైన జగన్ అనే భూతాన్ని మద్యం సీసాలోనే బంధిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని 27వార్డులో నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున మద్యం కుంభకోణం జరిగిందన్నారు. ఇందులో భాగమున్న ఏ వైసీపీ నాయకుడు తప్పించుకోలేరన్నారు. అలాగే జగన్ రెండోసారి రాకుండా మద్యం సీసాలోనే బంధిస్తామని హెచ్చరించారు. కదిరిలో మెడికల్, మద్యం మాఫియాలు నడుస్తున్నాయన్నారు. వైసీపీ నాయకులు ఒకరు మద్యం కుంభకోణంలో ఉంటే మరొకరు మెడికల్ మాఫియాలో ఉన్నారని తెలిపారు. చీకటిలో నరకమని తాను చెప్ప లేదని మాజీ మంత్రి మాటమారుస్తున్నాడని అన్నారు. మూడునెలలు ఆగితే మా వాడు ఆరోగ్యం బాగుచేసుకుని వస్తాడని పేర్నినాని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పేర్నినానీ... నీవు మగవాడుకాదా, నీకు చేవలేదా, నీ కోసం ప్రజలు, పార్టీలు మూడునెలలు ఆగాలాఅని ప్రశ్నించారు. నీకు చేవ ఉంటే డైరెక్టుగా... రా... అని సవాలు విసిరారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఓర్వలేక వైసీపీ నెగెటివ్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. ఇంటింటికెళ్లి సమస్యలు తెలుసుకుం టున్నామని, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామని ఆయన తెలి పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్ కుమార్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీడీఓకు పారిశుధ్య కార్మికుల వినతి

గాండ్లపెంట, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పంచాయతీల్లో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు సోమవారం ఎంపీడీఓ వెంకట రామిరెడ్డికి వినతిపత్రం అందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజాఫిర్యాదుల పరిష్కర వేదికలో కార్మికులు మాట్లాడుతూ తమకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. ఇందుకోసం గతంలో పది రోజుల పాటు రిలేదీక్షలు చేపట్టామ న్నారు. సమస్యలు పరిష్కరిస్తామని అప్పుడు అధికారులు హామీ ఇచ్చారని, అయితే ఇంతవరకు ఏ సమస్యా పరిష్కరించలేదన్నారు. వెంటనే తమకు రావల సిన జీతాలు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కెకె.రాజారెడ్డి, ఖాదర్‌బాషా, పారిశుధ్యకార్మికులు అక్కులప్ప, బాలక్రిష్ణ, వెంకటరమణ, కదిరప్ప, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

వంగపేరుకు హంద్రీనీవా నీటిని వదలాలి

- తహసీల్దార్‌కు రైతుల వినతి

కొత్తచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వంగపేరు నదికి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని వదలాలని మండల పరిధిలోని ఇరగంపల్లి, వంగంపల్లి, మరుకుంటపల్లి, లోచర్ల, కొడప గానిపల్లికి చెందిన రైతులు సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ... గతంలో హంద్రీనీవా కాలువ ద్వారా వంగపేరు నదికి నీటిని వదిలారన్నారు. ఈ నీటితో కనుముక్కల చెరువును నింపార న్నారు. ప్రస్తుతం లైనింగ్ పనులు చేస్తుండటంతో హంద్రీనీవాకు ఉన్న తూములను మూసివేయడం వల్ల వంగపేరు నదికి నీరు సరఫరా కావన్నారు. దీంతో దాదాపు 450 ఎకరాలలో పంట సాగుకు నీరు అందక భూములు బీళ్లుగా మారతాయన్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హంద్రీనీవా కాలువకు తూములు ఏర్పాటుచేసి వంగపేరు నదికి నీరు వదలాలని వారు కోరారు.

కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

- సమస్యలు పరిష్కరించేవరకు ఆపం: నాయకులు



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కార్మికులు(ఫైల్)

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. ధర్మవరం మున్సిపాలిటీలో 50 మంది కార్మికులు ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఇది వరకే సమస్యల పరిష్కారం కోసం అనేక దఫాలు ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్లినట్లు వారు చెబుతున్నారు. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో ప్రధానంగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వీధి లైట్లు వెలగడం లేదు. పైపులైన్‌ల మరమ్మతులు చేయడం సైతం నిలిపి వేశారు. దీంతో మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, బాబు, జయకృష్ణ స్పష్టంచేశారు.

కార్మికుల డిమాండ్లు ఇవీ...

- సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి. జీఓ నంబరు 36 ప్రకారం జీతాలు రూ. 21వేలు నుంచి రూ. 24,500కు పెంచాలి
- ఇంజనీరింగ్ కార్మికులను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి జీతాలు చెల్లించాలి
- గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు పెంచాలి
- తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు తమకు అమలు చేయాలి
- ఆప్కాస్‌ను రద్దుచేసి పర్మినెంట్ చేయాలి.
- ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలి.

డిమాండ్లను పరిష్కరించాలి..



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. నేను 2007 నుంచి ఇంజనీరింగ్ కార్మికుడికి పనిచేస్తున్నా. మాకు వచ్చే జీతాలు కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవు. ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలు పెంచాలని అనేక రకాలుగా ఉద్యమాలు, నిరసనలు, దీక్షలు చేపట్టినా ఎవరూ పట్టించు కోలేదు. ఈ ప్రభుత్వమైన మా సమస్యలను పరిష్కరించాలి.

- బొగ్గు నాగరాజు, ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు

ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం



మేము ఎన్నో ఏళ్ల నుంచి మున్సిపాలిటీలో కార్మికులుగా పనిచేస్తున్నాం. సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేశాం. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం లేదు. కొత్తవారికి పాత వారికి ఒకే జీతం ఇస్తున్నారు. అర్హతలు గుర్తించి రెగ్యులర్ చేయాలి. మా సమస్యలు ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

- బాబు, ఇంజనీరింగ్ కార్మికసంఘం పట్టణ కార్యదర్శి

ఘనంగా ఉరుసు



ముదిగుబ్బలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఊరిలో సోమవారం పీర్ల పండుగ సందర్భంగా చివరి రోజు ఉరుసు కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పీర్లను పూల షేరాలు, కొత్త బట్టలతో సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. భక్తులు పీర్లకు పూల షేరాలు, పూల దండలు, వెండి గొడుగులు, చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం చిన్న చావిడి వద్ద ఉరుసు మహోత్సవం నిర్వహించారు. యువకులు అల్లావు తొక్కారు. గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నంబులపూలకుంట, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువలు దుకాణాలపై సోమవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ... విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వస్తున్నట్లు ఎరువుల దుకాణాల యజమానులకు ముందుగా సమాచారం ఇచ్చామన్నారు. అధికారులు రావడానికి ముందే రెండు దుకాణాలు మూసివేసినట్లు తెలిపారు. యనమానులుకూడా అందుబాటులో లేకపోవడం పట్ల మండిపడ్డారు. అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలు, మందులు మాత్రమే అమ్మాలని, నకిలీవి విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు శివకుమార్, శివన్న, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో ఎరువుల దుకాణాల బంద్

కొత్తచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను సోమవారం మూసివేశారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారన్న సమాచారం రావడంతో మండల కేంద్రంలోని 20 దుకాణాలను బంద్ చేశారు. అయితే విజిలెన్స్ అధికారుల తనిఖీ గురించి ముందస్తు సమాచారంతోనే ఎరువుల దుకాణాలను మూసివేశారనే విమర్శలు వినబడుతున్నాయి.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి : టీడీపీ



17వ వార్డులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో సోమవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పథకాలు అందని వారి వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కమిటీ సభ్యులు వెంకటనారాయణ, అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాల విడుదల

అమడగూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం, సూపర్ సిక్స్ కరపత్రాలను సోమవారం టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ ఎల్‌ఐసీ నరసింహులు విడుదల చేశారు. ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. వారికి ఆ కరపత్రాలను అందజే శారు. ఇంటింటికి వెళ్లి పథకాల అమలును వివరించాలని, అందని వారి నివేదికను పార్టీ అధిష్ఠానికి చేరవేయాలని సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణపై సమావేశం

అమడగూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణపై బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణమండలంలో నిర్వహించే సమావేశానికి పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తనకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండకలకేంద్రంలోని తారక రామానగర్‌కు చెందిన అఫ్సర్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.40వేల చెక్కును సోమవారం దు గినేపల్లికి చెందిన అలీఇమామ్‌మౌజన్‌కు మాజీ ఎంపీటీసీ మహబూబ్‌బాషా, బాషసాబ్, షఫీ, ఫక్కీర్‌సాబ్ అందించారు.

ధర్తీ ఆబా అభియాన్‌పై గ్రామసభ

తనకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింతండాలో కోటపల్లి సర్పంచ్ మునేనాయక్ ఆధ్వర్యంలో ధర్తీ ఆబా జనభాగిదారి అభియాన్‌పై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ... మండలం లోని దేవళంతండా, రామప్పకుంటతండా, నడింతండా, గుట్టమీదతండా గ్రామాలను కేంద్రం ప్రభుత్వం ఈ పథకం కింద ఎంపిక చేసిందన్నారు. వచ్చే ఐదేళ్లపాటు ఈ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు విడుదలచేసి ఆ తండాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గ్రామస్థుల ఆమోదంతో జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మజీద్, చంద్రనాయక్, వివిధశాఖల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీరు మారరా?

ఓబుళదేవరచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల వేదికకు చాలామంది అధికారులు డుమ్మాకొట్టారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ వెంకటరాముడు, వైద్య సిబ్బంది మినహా ఇతర శాఖల అధికారులెవరూ ఉదయం 11గంటలైనా హాజరుకాలేదు. ప్రతివారం అధికారులు ఇలా డుమ్మా కొడుతుండడంతో తమ సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజాఫిర్యాదుల వేదికలో అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చింది వీరు కొందరే..

న్యూస్ బాక్స్

వైభవంగా కుంభాభిషేకం


అలంకరణలో స్వామివారు

మడకశిర టౌన్, జూలై14(ఆంధ్రజ్యోతి): వరుణుడి కరుణ కోసం సోమవారం పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సహస్రఘటిక కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ కమిటీ సభ్యులు, రైతుల ఆధ్వర్యంలో వేద పండితులు కుంభాభిషేకంతో పాటు వరుణయాగం, రుద్రాభిషేకం, పర్జన్య జపం, శత రుద్రాభిషేకంచ విరాటపర్వ పారాయణం, రుద్రహోమాలు తదితర పూజలు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వరుణదేవుడు కరుణించకపోవడంతో వర్షాలు కురువాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేకంగా పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. పట్టణవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే. మాజీ ఎమ్మెల్సీల ప్రత్యేక పూజలు

పట్టణ సమీపంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళ్వేర స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిపించారు.

అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయండి


కెనరా బ్యాంక్‌లో ఖాతాదారుల రద్దీ

గుడిబండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కెనరాబ్యాంక్‌లో రైతులు ఖాతాదారులకు అదనపు కౌంటర్లను ఏర్పాటుచేయాలని రైతులు శివన్న, సత్యనారాయణ, తిమ్మప్ప, నాగరాజు కోరారు. కెనరా బ్యాంక్‌లో మహిళా సంఘాలు, రైతు పంట రుణాలు, ఖాతాదారుల సేవింగ్స్ అధికంగా ఉండడంతో నగదు తీసుకోవడం, జమచేయడం వంటి పనులకోసం బ్యాంకుకు వచ్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులపాటు కాళ్లరిగేలా తిరుగుతున్నామని వాపోయారు. పంట రుణాలను రెన్యువల్ చేసుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పనులు కావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంక్ అధికారులు స్పందించి అదనపు కౌంటర్లు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

శ్రీరంగరాజులపల్లిలో తాగునీటికి కటకట


ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పరిగి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజులపల్లి గ్రామంలో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఐదు రోజుల నుంచి నీరు రాకపోవడంతో స్థానికులు చుట్టుపక్కల పొలాల్లోని బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తోంది. సైకిళ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలలో బిందెలను తరలించి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమ ఉన్నవారు నీటి ట్యాంకుల ద్వారా కొనుగోలుచేస్తున్నారు. వారం రోజుల క్రితం పైపులు పగిలిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. మరమ్మతులుచేపట్టడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో నీటి ట్యాంకర్ల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పనిచేయని వీడియో కాన్ఫరెన్స్


పనిచేయని వీడియో కాన్ఫరెన్స్ ముందు కూర్చున్న అధికారులు

గుడిబండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే గ్రీవెన్స్‌లో వీడియో కాన్ఫరెన్స్ పనిచేయకపోవడంతో అధికారులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఉదయం 10.30కు ఎంపీడీఓ కేశవరెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, అగ్రికల్చర్ ఏఈఓ మంజుళ, ఏఎస్ఐ రమణ హాజరయ్యారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు జామియామసీదు కమిటీవారు అన్నదానం చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రతినెలా చేపడుతున్నట్లు వారు తెలిపారు. వైద్యులు ఓంకార్, సీహెచ్ఓ రవీంద్ర, కమిటీ సభ్యులు చాంద్‌బాషా, షాషా, అన్సార్‌బాషా, ఇలియాజ్, అబ్దుల్లా, మహబూబ్, షాషా, సైఫుల్లా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అనుమానితుల ఇళ్లలో సోదాలు


అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఉదయం సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లలో పోలీస్ బృందాలు సోదాలు నిర్వహించాయి. పెనుకొండ, రొద్దం, కియ, సోమందేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. పది ఇళ్లలో సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు. అసాంఘిక కార్యకలాపాల ప్రేరేపితులు బాధితులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు.

పాటుకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లితండాకు చెందిన రైతు రమేష్‌నాయక్ పాముకాటుకు గురై సోమవారం అస్వస్థతకు గురయ్యారు. గణేనాయక్ కుమారుడైన రమేష్‌నాయక్ పొలంలో పనిచేస్తుండగా, నాగుపాటు కాటు వేసింది. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబసభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా వైద్యచికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

- ఇన్‌చార్జిలతో రెవెన్యూ పాలన
- కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలు, రైతులకు నిరీక్షణ తప్పడంలేదు. చిన్న చిన్న సమస్యలు సైతం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు వాపోయారు వాపోతున్నారు. రెగ్యులర్ అధికారులు లేక, ఇన్‌చార్జి అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో తిప్పలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ తహసీల్దార్ లేక ఏడాదైనా ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదన్నారు. ఇక్కడ గోరంట్ల తహసీల్దార్ మారుతి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్నారు. ఈయన లేనప్పుడు డీటీ రెడ్డిశేఖర్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నారు. అయితే మండలంలో అనేకమంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎం ద్వారా రీసర్వేకు సంబంధించి కార్యాలయానికి వస్తుంటారు. ఇటీవల తల్లికి వందనం పథకంలో భాగంగా 241మంది అర్హులు భూమి ఎక్కువ చూపడంతో అనర్హులుగా మారి పథకానికి దూరమయ్యారు. అలాగే మండలంలో చేపట్టిన జాతీయరహదారి, రైల్వే ప్రాజెక్ట్ పనుల కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి ఏళ్లు గడిచినా పరిహారం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది ఎప్పుడుంటారో ఎప్పుడుండరో తెలియక కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కదిరేపల్లి సర్వేనంబరు 251లో 30 ఎకరాలు, 249లో 15ఎకరాలు పైచిలుకు జాయింట్ ఎల్‌పీఎంలో రైతుల భూములుండగా పలువురు రైతులు కార్యాలయానికి వచ్చి సోమవారం పడిగాపులు కాశారు. అలాగే హైవే భూసేకరణలో భాగంగా గతంలో వెలిదడకల గ్రామంలో 16.70ఎకరాలు, తుంగోడులో 9.59ఎకరాలు సేకరించారు. ఇందులో తుంగోడు గ్రామంలో 4.90ఎకరాలు, వెలిదడకల 1.25ఎకరాలు పరిహారం అందాల్సి ఉండగా సోమవారం దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైంది. అవసరమైన నకళ్లను రైతులనుంచి సేకరించి నివేదిక పంపుతున్నట్లు వీఆర్ఓ లోకేష్ తెలిపారు. అంతేకాక అటెస్టేషన్, భూవివాదం, 1బి, అడంగళ్ తదితర వాటిపై సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


ల్యాండ్ ఎల్‌పీఎల్ భూముల వివరాలు నమోదుచేస్తున్న రైతులు

రైతు జీవితాల్లో వెలుగులు నింపేందుకే సోలార్ ప్రాజెక్ట్

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


అంగీకార పత్రాన్ని ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులకు అందిస్తున్న రైతు మారుతిరెడ్డి

మడకశిర రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే సోలార్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేస్తున్నాట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మండలంలోని బుళ్ళసముద్రం, హరేసముద్రం, కల్లుమర్రి, వైబి హళ్ళి, మణూరు, ఎస్.కోడిగేపల్లి పంచాయతీ గ్రామల రైతులతో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని బుళ్ళసముద్రం గ్రామ సమీపంలోని పొలాల్లో ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ అధికారులు సుబ్బరావు, నీతీష్‌కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు కష్టాలు తెలుసుకున్న సీఎం చంద్రబాబు నియోజకవర్గానికి సోలార్ ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. సోలార్ ప్రాజెక్ట్‌కు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు రూ.31 వేలు ఇస్తున్నారన్నారు. ఆ మొత్తం నిర్ణయించిన తేదీలోగా కంపెనీ ఖచ్చితంగా రైతు ఖాతాలోకి జమ చేస్తుందన్నారు. తిప్పేస్వామి మాట్లాడుతూ.. పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు చేతికిరాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ రైతులకు కుటుంబ పోషణ కష్టంగా మారడంతో సీఎం వారిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సోలార్ కంపెనీ ప్రాజెక్ట్ మంజూరు చేశారన్నారు. అనంతరం రైతులు ఎంతో సోలార్ ప్రాజెక్ట్‌కు భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. వారి అంగీకార పత్రాలను ఎమ్మెల్యే కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. రెవెన్యూ అధికారులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి,మండల కన్వీనర్ నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది: రంగస్వామి, రైతు ఉపార్లపల్లి



సోలార్ ప్రాజెక్ట్ మడకశిరకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రాంతంలో బీడుభూములను చూసి చలించిపోయిన ఎమ్మెల్యే, గుండుమల ప్రాజెక్ట్‌ను తీసుకురావడంతో ఆనందంగా ఉందన్నారు. మాకుటుంబానికి 25 ఏకరాల భూమి ఉన్నాయి. సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో 10 ఎళ్లుగా బీడుగా వదిలేశాం. సోలార్ ప్రాజెక్ట్‌కు భూమిని సంతోషంగా ఇస్తాం.

సోలార్ ప్రాజెక్ట్ వరంగా భావిస్తాం: నర్సేగౌడ్, రైతు, కల్లుమర్రి



వర్షాలు లేక పంటలు పండక కరువుతో అల్లాడిపోతున్న రైతులకు సోలార్ ప్రాజెక్ట్ రావడం వరంలాంటిది. ఎమ్మెల్యేకు, రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు. తనకు ఆరెకరాల భూమి ఉంది. సంతోషంగా భూమి ఇచ్చేందుకు అంగీకరిస్తున్నా.

కేంద్ర బృందం పరిశీలన

రొద్దం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సానిపల్లిలో కేంద్ర బృందం సభ్యుడు రామాంజనేయులు పరిశీలించారు. సోమవారం సానిపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్-2 కింద సెంట్రల్ టీమ్‌సభ్యులు పాఠశాల ఆవరణం, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, శుద్ధ జలకేంద్రం, చెత్తసంపద కేంద్రం తదితర వాటిని పరిశీలించారు. జిల్లా కోఆర్డినేటర్ సాయినాథ్ బాబు, ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి బాబు, సర్పంచ్ పరమేశ్, ఏఎన్‌ఎంలు, సచివాలయ, ఐకేపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిండికేట్ అభ్యర్థుల గెలుపు

పావగడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌కే సంఘానికి ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల్లో 15మంది సభ్యుల్లో 14మంది సిండికేట్, ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. అనీల్‌కుమార్ అత్యధికంగా 113ఓట్లతో గెలుపొందగా నాగేంద్రబాబు 18ఓట్లతో అతితక్కువ ఓట్లు సాధించినట్లు అధికారులు తెలిపారు. అనీల్‌కుమార్ జీఎస్‌కి 113, అనీల్‌కుమార్ జిసి 106, వెంకట రమణప్ప 106, శ్రీనివాస్ కెవి 104, వెంకట్రాంరెడ్డి 103, అశ్వత్‌కుమార్ 100, రఘునందన్ 96, మను94, వైఎర్ మోహన్ 94, సుబ్బనరసింహ 89, అనందరావు 86, రాజగోపాల్ 80, కృష్ణకుమార్75, విజయ్‌కుమార్ 75, డా. చక్కెర్‌రెడ్డికి 73 ఓట్లు లభించాయని ఎన్నికల అధికారి సోమసుందర్ తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సోమవారం సూగూరు ఆబాద్‌పేటలో పర్యటించారు. చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. చెత్తఎక్కడబడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బంది సూచించినచోటే వేయాలని ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తారన్నారు. పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ ఇర్షాద్, నాయకులు హనుమంతు, శివ, ప్యారుసాబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేట వెంకటరమణస్వామి, సూగూరు ఆంజనేయస్వామి ఆలయధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓలు నరసింహమూర్తి, నరసింహరాజు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం దేవదాయ, ధర్మాదాయశాఖ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించిందని, దేవునికి సేవచేయాలనుకునే వారు 20రోజుల్లోపు ఆయా ఆలయాల ఈఓలకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఆర్థిక సాయం

రొళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలం కొడగార్లగుట్ట గ్రామానికి చెందిన గంగప్ప, తిప్పక్క దంపతుల కుమారుడు దేవరాజు ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బాధిత కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో బాధితుడి తల్లికి ఎమ్మెల్యే ఆర్థిక సాయాన్ని అందించారు.

ఎమ్మెల్యే పర్యటన ఏర్పాట్ల పరిశీలన

అమరాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మడకశిర రోడ్డుపక్కన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబవుతున్న ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి 16న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి తహసీల్దార్ లక్ష్మీనరసింహం, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, ఎస్సీసెల్‌అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పరిశీలించారు. జడ్పీటీసీ సారక్క, నరసింహమూర్తి, చెన్నప్ప, నారాయణప్ప, కెంచప్ప, శివకుమార్, ఉదగూరు తిమ్మయ్య పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. వాడి వేడి చర్చలతో అభివృద్ధి కార్యక్రమాలపై సాగాల్సిన సమావేశం చప్పగా ముగిసింది. ప్రజాప్రతినిధులు నామమాత్రంగా హాజరుకావడంతో అధికారులు కార్యక్రమాన్ని మమ అనిపించారు. కొందరు వేరుశనగ పంపిణీపై ప్రశ్నలు లేవనెత్తారు. గంటలోపే పంపిణీ కార్యక్రమాన్ని ముగించారని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆయా రైతు భరోసాకేంద్రాల ద్వారా 250క్వింటాళ్లు పంపిణీ చేస్తామన్నారని వివరించారు. మిగిలినవారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదుచేసుకుంటే వారికి అందజేస్తామన్నారు. అనంతరం తల్లికివందనం, రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలపై చర్చ జరిగింది. సర్పంచ్ గంగాదేవి, ఎంపీపీ గంగమ్మ, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం అంగనవాడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమందేపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని సోమందేపల్లి, గోరంట్ల, పరిగి, మండలాల అంగనవాడీ టీచర్లు, ఆయాలకు శిశుసంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో విద్యా నిపుణులు శ్రీనివాసులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అభినయ గేయాలతో ఎలా ఆకట్టుకుని విద్యాబుద్దులు నేర్పాలో వివరించారు. లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు, రక్తహీనత, మాతాశిశుమరణాలు తగ్గించడం, బాల్య వివాహాలు అరికట్టడం, పిల్లల బ్రెయిన్ డెవలప్మెంట్ యాక్టివిటీస్, ప్రీస్కూల్ ద్వారా ఏ సమయంలో ఏ అంశాలపై బోధించాలో అవగాహన కల్పించారు. ఐసీడీపీఓ గీత, సూపర్‌వైజర్లు, అంగనవాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హిందీ టీచర్‌ను నియమించండి

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తూమకుంట పారిశ్రామికవాడలోని పాఠశాలలో హిందీ టీచర్‌ను నియమించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి వినతిపత్రాన్ని అందించారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 50మంది విద్యార్థులున్నారని, వారు వలస వచ్చిన కార్మికుల పిల్లలన్నారు. వీరికి హిందీలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులను నియమించకపోతే వారు బడిబయట పిల్లలుగా మారిపోతారన్నారు. నాయకులు నాగేంద్ర, అనుదీప్, మహేష్, నజీర్, లిఖిత్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

అమరాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో సోమవారం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ లక్ష్మీనరసింహ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వంటచేసే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వండిన అన్నాన్ని రుచిచూశారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో కరవే అధ్యక్షురాలి మృతి

పావగడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రక్షణ వేదిక మహిళా విభాగం, రైతు సంఘం మహిళా నాయకురాలు అన్నపూర్ణ(55) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. మహిళా నాయకురాలుగా తుంగభద్ర నీటి కోసం బెంగళూరు వరకు పాదయాత్రలో కీలక పాత్ర పోషించిన అన్నపూర్ణమ్మ ఎన్నో పోరాటాలు చేశారు. ఆమె మృతి పట్ల తాలూకా రైతు సంఘం, కర్ణాటక రక్షణ వేదిక, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

పెనుకొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని విద్యార్థులు, ప్రజలు కేంద్ర హోంమంత్రి అమీత్‌షాకు పోస్ట్‌కార్డుల ద్వారా వినతిపత్రాలు పంపించారు. సోమవారం స్థానిక జూనియర్‌కళాశాల విద్యార్థులు, ఆర్డీటీ అభిమానులు, ప్రజలు బ్యానర్లు, ప్లకార్డులుపట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హోంమంత్రికి రాసిచ్చిన పోస్ట్‌కార్డును పోస్టుబాక్సుల్లో వేశారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. పేద విద్యార్థులను చదివించడంతోపాటు విద్యాలయాల అభివృద్ధికి విరాళాలు అందించి ఎంతో సహకరిస్తున్నారన్నారు. పెనుకొండ జూనియర్ కళాశాలకు ఆడిటోరియం నిర్మించాలని ఆర్డీటీ ద్వారా ఎంతోమందికి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఆర్డీటీ కోసం లక్ష పోస్టుకార్డుల ఉద్యమం, ఉభయజిల్లాల్లో విద్యార్థులు నిర్వహిస్తున్నారన్నారు. 26వరకు ఈ పోస్టుకార్డుల ఉద్యమం కొనసాగుతుందన్నారు. ప్రతి మండలం నుంచి 1,600 పోస్ట్‌కార్డులు అమిత్‌షాకు పోస్టు చేస్తామన్నారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సాహితీ గగన్‌మహల్ సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం


కరపత్రాలు అందిస్తున్న చైర్మన్ రమేష్, టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పట్టణంలోని ధర్మపురంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు అమర్నాథ్, షఫీ, తిరుపతయ్య, అశ్వత్థనారాయణ, షబ్బీర్, ఇర్షాద్, నెట్టప్ప, మల్లప్ప, లక్ష్మీ పాల్గొన్నారు.



సోమందేపల్లి: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో వివిధ బూత్‌లలో పథకాలపై ప్రచారం చేశారు. కేతగానిచెరువు, సుద్దకుంటపల్లి గ్రామాల్లో ప్రజలకు పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయులు, కిష్టప్ప, మహేంద్ర, సుబ్బు, మారుతి, కొల్లప్ప, వరలక్ష్మీ, భానుకీర్తి, సంజీవప్ప, రవి పాల్గొన్నారు.



రొద్దం: రాష్ట్రంలో ఆగస్టు నెలలో ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సుప్రయాణం చేపట్టబోతోందని టీడీపీ నాయకులు మాధవనాయుడు అన్నారు. సోమవారం తురకలాపట్నం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. టైలర్ అంజనేయులు, నరసింహులు, పుల్లప్ప, హరి, శ్రీనివాసులు, షన్ముఖ, వెంకటరాముడు పాల్గొన్నారు.



అగళి: మండలంలోని హళ్లికెర, ముత్తేపల్లి గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి గురునాథ్, డీలర్ రామన్న ఆధ్వర్యంలో ఇంటింకి వెళ్లి కరపత్రాలు అందించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. బూత్ ఇన్చార్జ్ దేవరాజ్, జగదీశ్, శివారెడ్డి, రామన్న, రఘు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ



కరపత్రాలు చూపుతున్న బద్రీనాయక్, ప్రజలు

రొళ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవినకుంట, రొళ్ల, వద్రహట్టి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు బద్రీనాయక్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ 11వ సంవత్సరం సుపరిపాలన గురించి వివరించారు. ఎస్సీమోర్చా ప్రధాన కార్యదర్శి రమేష్, పట్టాభిరామయ్య, నారాయణప్ప, గోవిందప్ప పాల్గొన్నారు.

నిరంకుశ పాలన సాగిస్తున్న ప్రభుత్వాలు


గోరంట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పాలన సాగిస్తూ కేవలం సంపన్నులకే పథకాలు కట్టబెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వేమయ్యయాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సీపీఐ మండల సభలో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో ఆయన, డివిజన్ కార్యదర్శి శ్రీరాములతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికుల కష్టాలను ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. పార్టీలన్నీ కార్పొరేట్ సంస్థలకు మద్దతుగా నిలుస్తూ, రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కియ, వాటి అనుబంధ పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శి సురేష్‌లను ఎన్నుకున్నారు. కార్మిక సంఘాల నాయకులు రామక్రిష్ణ, సుధాకర్, బాలస్వామి, ఆంజనేయులు, రాజగోపాల్ చీల నారాయణస్వామి, గొల్ల కిష్ట పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు తాగునీటి సౌకర్యం


కళాశాలలో పైప్‌లైన్ పనులు చేస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పంచాయతీ నిధుల నుంచి టీడీపీ నాయకులు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో తాగునీటి సౌకర్యం కోసం పైప్‌లైన్ వేయడానికి ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేపట్టారు. సమస్యను మంత్రి సవిత దృష్టికి నాయకులు తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని ఆదేశించడంతో పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, వీరాంజనేయులు, సిద్దన్న, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

గోరంట్ల, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్దనున్న బెస్ట్ యూనివర్సిటీ, గోరంట్లలోని ఎస్‌ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో వివిధ రకాల నేరాలు, వాటిని ఎదుర్కోవడంపై శక్తి టీమ్ పోలీసులు విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. శక్తిటీమ్ ఇన్‌చార్జి శ్రీనివాసులనాయక్, రేణుకమ్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శక్తి పోలీస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ, యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జయప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.